మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
మంగళవారం 25 ఆగస్టు 2026 పేజీలు : 4

## రామానుజ కూటమి రద్దు ఆర్డర్‌పై పునఃపరిశీలన చేయాలి

### ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలి.. సూర్యలంకలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలి: కోన రఘుపతి



బాపట్లలో రామానుజ కూటమి అమాల్గమేషన్ రద్దు నిర్ణయంపై మాజీ ఉపసభాపతి కోన రఘుపతి అభ్యంతరం వ్యక్తం చేశారు. భక్తు లు, మాకర్లవారి కుటుంబాలు, ప్రజలతో సంప్రదించకుండా ఉత్తర్వు లు జారీ చేయడం సరికాదని, వాటిని పునఃపరిశీలి ంచాలని కోరా రు. ఆలయాల నిర్మాణాలు, సూర్యలంక ఎయిర్ పోర్టు అంశాలపైనా ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బాపట్ల రక్షణ బ్యూరో...

2లో

# గుంటూరులో చీకటి దందాలు..!

### అసాంఘిక కార్యకలాపాలకు గుంటూరు గా కలకలం!



- పేకాట, స్పా సెంటర్లు, లాడ్జిలపై ఆరోపణలు..
- నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది?
- ఉన్నతాధికారులకు సమాచారం చేరుతోందా?

వివరాలు 2లో..

గుంటూరు: రక్షణ క్రైమ్ స్పెషల్


### దాడులు జరుగుతున్నా.. దందాలు ఎందుకు ఆగడం లేదు?

గుంటూరు నగరం నడిబొడ్డున పేకాట, స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు సాగు తున్నాయన్న ఆరోపణలు పోలీసు నిఘా వ్యవస్థను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఎస్పీ ప్రత్యేక బృందాలతో దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా.. కొన్నిచోట్ల కార్యకలాపాలు మళ్లీ యథేచ్ఛగా కొనసా గుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెలనెలా భారీగా మామూళ్లు చేతులు మారుతున్నాయన్న ఆరో పణల వెనుక అసలు 'పెద్దల'టవరు? స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నా.. అది ఎస్పీ కార్యాలయానికి ఎందుకు చేరడం లేదు? ప్రత్యేక శాఖ నిఘా ఏం చేస్తోంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు గుంటూరు పోలీసు శాఖ లోనే చర్చనీయాంశంగా మారాయి. దాడులు చేసి పట్టుకోవడం కంటే.. దందాలు పుట్టకముందే పసిగట్టా ల్సిన నిఘా వ్యవస్థే అనుమానాల నీడలోకి రావడం ఆందోళన కలిగిస్తోంది.

### టిఫిన్ సెంటర్‌లో కోడిగుడ్ల కోసం..

# అంగన్‌వాడీలే టార్గెట్?

వివరాలు 2లో..




'విలేకరి' ముసుగులో తనిఖీలపై అనుమానాలు

బాపట్ల రక్షణ న్యూస్

# జీఎంసీలో ఏసీబీ సోదాలు

### 156 పనులపై ఆరా.. ఇంజినీరింగ్ విభాగంలో ముమ్మర తనిఖీలు



2లో


గుంటూరు, జీఎంసీ (రక్షణ న్యూస్): జీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో ఏసీబీ పం జా విసిరింది. 156 అభివృద్ధి పనుల్లో అక్రమాలపై అనుమానా లతో 10 మందికిపైగా అధికారులు రంగంలోకి దిగి ఫైళ్లు, టెండర్లు, బి ల్లులు, పనుల వివరా లను జల్లెడ పడుతు న్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్ వ్యాఖ్య లతో సోదాల తీవ్రత మరింత చర్చనీయాంశమైంది.

# మురళీకృష్ణ బదిలీపై వెనక్కి తగ్గిన శాఖ

**గుంటూరు మార్కెట్ కమిటీకి 'ఓడీ' ఉత్తర్వులు రద్దు**

### రక్షణ తొలి ఎఫెక్ట్...

'సీఎం సార్.. మిర్చి యార్డు ఫెయిల్' కథనానికి తొలి స్పందన! గురజాల మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మురళీకృష్ణను గుంటూరుకు ఓడీపై పంపిన ఉత్తర్వులు రద్దు చేస్తూ, తిరిగి గురజాలకు పిలిపించుకున్న అధికారులు.



21/48/2026-ESTABLSH-MRKT

PROCEEDINGS OF THE DIRECTOR OF AGRL. MARKETING, GOVERNMENT OF ANDHRA PRADESH, GUNTUR.

AGC05-15021/48/2026 Dated:24-08-2026

PROCEEDINGS

Sub:- Estt.,-Agrl. Mktg. Dept.- AMC Service – Sri G. Murali Krishna, Supervisor, Agrl. Market Committee, Gurajala – Placed on other duty at Agrl. Market Committee, Guntur –Cancelled-Orders-Issued.

Ref:- 1. This office Proc.No.AGC05-15021/48/2026, dtd: 20.08.2026.
2. Application of Sri G. Murali Krishna, Supervisor, AMC, Gurajala Dt: Nil along with Endt. No. 298 Dt:13.03.20226 of Hon'ble Minister for Agricultural & Co-operative, Marketing, Govt of A.P.

** ** **

ORDER :-

In view of the administrative reasons the orders issued vide reference 1st cited plac the services of Sri G. Murali Krishna, Supervisor, AMC, Gurajala on OD at AMC, Guntur hereby cancelled.

The Secretaries, Agrl. Market Committees, Gurajala / Guntur shall take necessary act immediately.

Approved by:Director of Agrl. Marketing (FA

To
Sri G. Murali Krishna, Supervisor, AMC, Gurajala.
Copy to the Chairman's, AMCs, Gurajala / Guntur for necessary action.
Copy to the Secretaries, AMCs, Gurajala / Guntur for necessary action.
Copy to DAT & MOs, Palnadu/ Guntur for information.
Copy to the DDM, Guntur for information.
Copy to the RJDM, Vijayawada for information.

//F.B.O//

K. NAGAVE
Deputy Director of Market

# టీడీపీ మాజీ నేత బాలకోటిరెడ్డి అరెస్ట్

### చుండూరు పోలీస్‌స్టేషన్ ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు..

#### రంగారెడ్డి జిల్లాలో అదుపులోకి

చుండూరు పోలీస్‌స్టేషన్‌లో విధులకు ఆటంకం కలిగించి, సీఐతో అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాలకోటిరెడ్డిని పోలీసులు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చుండూరుకు తరలించి న్యాయస్థానంలో హాజరుపరిచారు.



2లో

## టిఫిన్ సెంటర్‌లో కోడిగుడ్ల కోసం.. అంగన్‌వాడీలే టార్గెట్?

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల: టిఫిన్ సెంటర్ వ్యాపారం చేసుకునే ఓ వ్యక్తి.. అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్ల లెక్కలు తేల్చేందుకు ఎందుకు తిరుగుతున్నారన్న ప్రశ్న బాపట్లలో చర్చనీయాంశంగా మారింది. విలేకరిగా చెప్పుకుంటూ అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శించడం, కోడిగుడ్ల నిల్వ, పంపిణీ, వినియోగంపై సిబ్బందిని ప్రశ్నించడం, రికార్డులు పరిశీలించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిఫిన్ సెంటర్‌లో కోడిగుడ్ల అవసరం ఉందా? లేక అంగన్‌వాడీల్లో కోడిగుడ్ల పేరుతో మరేదైనా లక్ష్యం ఉందా? అన్న అనుమానాలు సిబ్బందిలో వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులదే. పీడీ, సీడీపీఓ, సెక్టార్ సూపర్‌వైజర్లకు నిర్దిష్ట బాధ్యతలు ఉన్నప్పటికీ.. సంబంధం లేని వ్యక్తి అధికారుల మాదిరిగా వ్యవహరించడంపై సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ చేయించాల్సి ఉండగా.. వ్యక్తిగతంగా కేంద్రాల చుట్టూ తిరుగుతూ సిబ్బందిని ఒత్తిడికి గురిచేయడం ఎందుకన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మరోవైపు, కొందరు అంగన్‌వాడీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత కక్షలతోనే ఈ తనిఖీలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కోడిగుడ్డు ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి వెళ్లింది? అన్నది శాఖాధికారులు తేల్చాల్సిన విషయం.. మరి టిఫిన్ సెంటర్ వ్యక్తి లెక్కలు ఎందుకు చూస్తున్నారు? అన్న ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి.. సదరు వ్యక్తికి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసే అధికారం ఉందా? కోడిగుడ్ల వ్యవహారంపై సమాచారం ఎవరు అందిస్తున్నారు? అనే అంశాలను తేల్చాలని సిబ్బంది కోరుతున్నారు.

## ఎస్సీ పథకాలపై ఏలూరి సమీక్ష

**పర్చూరు రక్షణ న్యూస్**

తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, పర్చూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శంకరశెట్టి చిరంజీవి ఎమ్మెల్యేకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు.అనంతరం కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పైఎమ్మెల్యే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, వారికి అందుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా సూచించారు చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఏలూరికి 'ప్రకాశం డిస్ట్రిక్ట్ గెజిటీర్లు' పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

# గుంటూరులో చీకటి దందాలు...!

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు: రక్షణ క్రైమ్ స్పెషల్**

రాజధాని ప్రాంతానికి కీలక నగరమైన గుంటూరులో పేకాట, స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అసాంఘిక కార్యకలాపాలు పోలీసు శాఖలోని నిఘా వ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. నగరంలో పలు స్పా సెంటర్లు, లాడ్జిలు, శివారు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై చాలాకాలంగా ఆరోపణలు వినిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న సమాచారం ఉన్నతాధికారుల వరకు ఎందుకు చేరడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దాడులు చేస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మాత్రం మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**స్పా సెంటర్ల ముసుగులో ఏం జరుగుతోంది?...**గుంటూరు నగర పరిధిలో సుమారు 70 నుంచి 80 వరకు స్పా సెంటర్లు కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటిలో కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మసాజ్ పేరుతో నడుస్తున్న కేంద్రాల్లో వాస్తవంగా ఏం జరుగుతోంది? అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు ఏమిటి? వారి నియామకం, ధ్రువపత్రాలు, నిర్వాహకుల నేపథ్యం, సీసీ కెమెరాల నిర్వహణ వంటి అంశాలపై నిరంతర తనిఖీలు జరుగుతున్నాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఇటీవల ఎస్పీ స్వయంగా కొన్ని స్పా సెంటర్లపై దాడులు నిర్వహించడంతో అక్కడ నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే కొన్ని కేంద్రాలపై మాత్రమే చర్యలు ఎందుకు? మిగిలిన వాటిపై నిఘా లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కిందిస్థాయిలోనే 'మేనేజ్' అవుతున్నాయా?...**కొన్ని స్పా సెంటర్లకు సంబంధించిన సమాచారం స్థానిక పోలీసులకు ముందుగానే తెలిసినా.. ఆ సమాచారం ఉన్నతాధికారుల దృష్టికి చేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కేంద్రాల నుంచి నెలవారీగా భారీ మొత్తాల్లో మామూళ్లు వసూలవుతున్నాయనే ప్రచారం కూడా ఉంది. అయితే ఇవి ధ్రువీకరించాల్సిన ఆరోపణలే. నిజంగా ఇలాంటి వసూళ్లు జరుగుతున్నాయా? జరిగితే ఎవరి ప్రమేయం ఉంది? అనే అంశాలపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణ జరిపితేనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.ఇదే సమయంలో ప్రత్యేక శాఖ నిఘా వ్యవస్థ పనితీరు ఏమిటి? అన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. నగరంలో ఇంత పెద్ద సంఖ్యలో వ్యాపార సంస్థలు కొనసాగుతున్నప్పుడు వాటి కార్యకలాపాలపై నిఘా ఉండాలి. అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం ఉంటే ఉన్నతాధికారులకు నివేదించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉంటుంది. సమాచారం ఉన్నప్పటికీ చేరలేదా? లేక సమాచారం ఉన్నతాధికారుల వరకు చేరకుండా మధ్యలోనే ఆగిపోతుందా? అన్నది తేలాల్సి ఉంది.

**పేకాట శిబిరాలపైనా ఆరోపణలు...**గుంటూరు రూరల్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో పేకాట శిబిరాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాలను అడ్డుపెట్టుకుని శివారు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నా.. కొద్దిరోజులకే మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి.దాడులు జరుగుతున్నాయి.. అరెస్టులు జరుగుతున్నాయి.. అయినా కార్యకలాపాలు ఎందుకు ఆగడం లేదు? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

**లాడ్జిలపై కూడా నిఘా అవసరం...**నగరంలోని కొన్ని లాడ్జిల వద్ద అనధికారిక వసూళ్లపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కొందరు రౌడీషీటర్లు, గంజాయి ముఠాలకు చెందిన వ్యక్తులు కొన్ని లాడ్జిల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చకు దారితీస్తోంది. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అన్నది పోలీసుల సమగ్ర విచారణతోనే తేలాలి.ఇలాంటి సమావేశాలు నిజంగా జరిగితే.. వాటి వెనుక ఉద్దేశం ఏమిటి? ఎవరు పాల్గొన్నారు? లాడ్జి నిర్వాహకులకు విషయం తెలుసా? స్థానిక పోలీసులకు సమాచారం ఉందా? అన్న కోణాల్లో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది.

**ఎస్పీకి అసలు సవాలు ఇదే..**గుంటూరు నగరంలో శాంతిభద్రతలను కాపాడటంతోపాటు పోలీసు శాఖలోని అంతర్గత నిఘా వ్యవస్థను కూడా ఎస్పీ సమీక్షించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక బృందాలు దాడులు చేయడం ఒక కోణమైతే.. అసాంఘిక కార్యకలాపాలు మొదలయ్యే ముందే సమాచారం సేకరించి అడ్డుకోవడం అసలు పోలీసింగ్.అధికారికంగా ధ్రువీకరించని ఆరోపణలను వాస్తవాలుగా పరిగణించకుండా, స్పా సెంటర్లు, లాడ్జిలు, పేకాట శిబిరాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలి. ముఖ్యంగా పోలీసులకు ముందే సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.గుంటూరు నగరంలో ఎక్కడ ఏం జరుగుతుందో పోలీసులకు తెలియదా? తెలిసి కూడా సమాచారం ముందుకు వెళ్లడం లేదా? లేక మధ్యలోనే వ్యవహారం 'మేనేజ్' అవుతోందా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పోలీసు శాఖదే. ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను బయటపెడితేనే గుంటూరు ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుంది. లేకపోతే దాడులు ఒకవైపు.. అసాంఘిక కార్యకలాపాలు మరోవైపు అన్న పరిస్థితి మరింత బలపడే ప్రమాదం ఉంది.

## జీఎంసీలో ఏసీబీ సోదాలు

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, జీఎంసి (రక్షణ న్యూస్):**

గుంటూరు నగరపాలక సంస్థలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 10 మంది కిపైగా అధికారులు బృందాలుగా రంగంలోకి దిగి ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో రికార్డులు, దస్త్రాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు 156 అభివృద్ధి పనులకు సంబంధించి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ వర్గాల నుంచి సమాచారం.మధ్యాహ్నం సమయంలో జీఎంసీ కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు ఇంజినీరింగ్ విభాగంలోకి వెళ్లి సంబంధిత అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పనులకు సంబంధించిన టెండర్లు, అంచనాలు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, కొలతల పుస్తకాలు, పనుల పూర్తిస్థాయి వివరాలను పరిశీలించినట్లు తెలిసింది. పనులు జరిగిన తీరు, వాటికి చెల్లింపులు జరిగిన విధానం, అంచనాలకు--క్షేత్రస్థాయి పనులకు మధ్య తేడాలు ఉన్నాయా? తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

**156 పనులపై దృష్టి..**జీఎంసీలో చేపట్టిన 156 పనులకు సంబంధించి అక్రమాలు ఉన్నాయా? అనే కోణంలో ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్ వెల్లడించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఆయా పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. తనిఖీలు పూర్తయిన తర్వాత లభించిన ఆధారాలు, రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఒకేసారి పెద్ద సంఖ్యలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడంతో జీఎంసీ సిబ్బందిలో ఉత్కంఠ నెలకొంది. అధికారులు ఆయా ఫైళ్లను తెప్పించుకుని ఒక్కో పనికి సంబంధించిన అనుమతులు, అంచనాలు, టెండర్ ప్రక్రియ, పనుల అమలు, బిల్లుల చెల్లింపుల వివరాలను సరిపోల్చి చూస్తున్నట్లు సమాచారం.

**ఫైళ్ల పరిశీలన.. సిబ్బంది నుంచి వివరాలు...**పలు విభాగాలకు సంబంధించిన రికార్డులను కూడా ఏసీబీ అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ పనుల్లో నిబంధనలు పాటించారా? కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఏ ప్రాతిపదికన చేశారు? పనులు పూర్తయ్యాయా? నాణ్యత ప్రమాణాలు పాటించారా? అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా, గతంలోనూ గుంటూరు నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలపై ఏసీబీ దృష్టి సారించిన సందర్భాలున్నాయి. తాజా తనిఖీలు కూడా అందులో భాగంగానేనా, లేక నిర్దిష్ట ఫిర్యాదుల ఆధారంగా జరిగాయా అన్నదానిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.ప్రస్తుతం సోదాలు, రికార్డుల పరిశీలన కొనసాగుతున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఎలాంటి ఆధారాలు సేకరించారు? ఎవరైనా బాధ్యులుగా తేలుతారా? తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఆసక్తికరంగా మారింది. తనిఖీలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారుల అధికారిక ప్రకటనతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/25/2026 4:11 AM Page 3



# గుండెపోటుతో డ్రైవర్.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న బస్సు




**గుంటూరు, రక్షణ న్యూస్**

పాఠశాల బస్సు డ్రైవర్‌కు మార్గమధ్యలో గుండెపోటు రావడంతో బస్సు అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన ఘటన గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. అయితే స్థానికులు సకాలంలో స్పందించడంతో బస్సులోని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా బయ టపడ్డారు. ఎస్‌వీఎన్ కాలనీ సమీపంలోని నారాయణ ఇంగ్లిష్ మీడి యం పాఠశాలకు చెందిన బస్సు ఉదయం విద్యార్థులను ఎక్కిం చుకుని పాఠశాలకు వెళ్తోంది. మార్గమధ్యలో డ్రైవర్ అకస్మాత్తుగా తీవ్రమైన గుండెనొప్పికి గురయ్యారు. దీంతో బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. అనంతరం బస్సు అక్కడే నిలిచిపోయింది. ఒక్కసారిగా జరిగిన ఘటనతో బస్సులోని చిన్నారులు భయాందోళనకు గురై కేకలు వేశారు. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థులను ఒక్కొక్కరినీ సురక్షితంగా బస్సు నుంచి కిందకు దించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బస్సు ఢీకొట్టడంతో మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించారు. అనంతరం అస్వస్థతకు గురైన డ్రైవర్‌ను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఆందోళన నెలకొంది. స్థానికుల చొరవతో పెను ప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చు కున్నారు.

# హామీల్లో 90 శాతం అమలు చేశాం: కన్నా

**సత్తెనపల్లి, రక్షణ న్యూస్**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసి చూపించామని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డులో సోమవారం నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం.. అభివృద్ధి' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులోని ఇళ్లకు వెళ్లిన కన్నా లక్ష్మీనారాయణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను తెలియజేయాలని కూటమి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

**గుంటూరు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**




ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో అన్ని విభాగాల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌కు ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏదైనా కారణంతో సమస్య పరిష్కారంలో జాప్యం జరిగితే ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి స్పష్టంగా తెలియజేసి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం పీజీఆర్‌ఎస్ ద్వారా మొత్తం 39 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 15, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు నాలుగేసి, అకౌంట్స్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్, ఎస్‌ఈ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చెన్నకేశ

**వినుకొండ, రక్షణ న్యూస్**



ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. వినుకొండ పట్టణంలో నిర్వహించిన సంఘం ద్వితీయ మహాసభల్లో సత్తెనపల్లికి చెందిన వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పలువురు సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన వారు జిల్లా కార్యవర్గంలో స్థానం దక్కించుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా సత్తెనపల్లికి చెందిన పొత్తూరి రామకోటయ్య, ఎలిశెట్టి ప్రసాద్, కే.ప్రేమ్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నిక సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు, రంగస్థల కళాకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. చెన్నకేశవరావు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముసునూరి రమేష్, మాజీ కార్యదర్శి నరిశెట్టి వేణుగోపాల్, ఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎస్.ఎం.సుభాని తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ద్వారా సామాజిక సమస్యలు, ప్రజా చైతన్య అంశాలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కార్యవర్గం ప్రజా కళారంగానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

# ఉత్తమ పోలీసు అధికారి అవార్డుకు ఎస్సై నాగరాజుకు సన్మానం



**పిడుగురాళ్ల, రక్షణ న్యూస్**

ఉత్తమ పోలీసు అధికారి అవార్డు అందుకున్న పట్టణ ఎస్సై శివ నాగరాజును ఎమ్మార్పీఎస్ మహిళా బృందం సోమవారం ఘనంగా సన్మానించింది. ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఎస్సై నాగరాజు ఉత్తమ పోలీసు అధికారి అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ మహిళా నాయకులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ పోలీసు అధికారి అవార్డు దక్కడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దేవరకొండ సుశీల మాదిగ, గురజాల నియోజకవర్గ అధ్యక్షురాలు కోటేశ్వరి మాదిగ, మాచవరం మండల అధ్యక్షురాలు రబక మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎస్సై నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు మరింత బాధ్యతను పెంచుతుందని, పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు భద్రత కల్పించడంలో ఆయన సేవలు కొనసాగాలని కోరారు. పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎస్సై నాగరాజును సన్మానించిన కార్యక్రమం స్థానికంగా జరిగింది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/25/2026 4:11 AM Page 4



# అర్జీల పరిష్కారంలో ప్రజా సంతృప్తే లక్ష్యం



**నరసరావుపేట, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నాణ్యతతో పరిష్కరించి ప్రజల సంతృప్తిని సాధించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి అద్దయ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతోపాటు అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోందని తెలిపారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించాలని అధికారులను కోరారు. అర్జీలను ఎక్కువకాలం పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారునికి తెలియకుండా ఎండార్స్‌మెంట్ చేసి అప్‌లోడ్ చేస్తే ఆ అర్జీ తిరిగి ఓపెన్ అవుతుందని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మొత్తం 116 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించి 35 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో గురజాలకు 7, సత్తెనపల్లికి 9, నరసరావుపేటకు 19 దరఖాస్తులు ఉన్నాయి. ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించిన సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యుఎస్ శివారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పులిచింతల శ్రీరాములు రెడ్డి, డీపీఓ నాగేశ్వర నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.ం

## అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలి: సంయుక్త కలెక్టర్ సంజనా సింహా



**నరసరావుపేట, రక్షణ న్యూస్**

దూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంయుక్త కలెక్టర్ సంజనా సింహా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంపై ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం సేకరిస్తున్నందున అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. భూముల సవరణలు, 22-ఏ అంశాలపై అధికంగా అర్జీలు వస్తున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు



**గుంటూరు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):** నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి స్థాయిలో నిషేధం అమలులో ఉందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత నెల రోజులుగా నగరవ్యాప్తంగా ప్రచార సాధనాలతోపాటు సచివాలయాల పరిధిలో కరపత్రాల పంపిణీ ద్వారా దుకాణదారులు, వ్యాపారులు, ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇకపై దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వీధి వ్యాపారులు లేదా ప్రజలు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా, నిల్వ చేసినా, పంపిణీ చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి, రెండో విడతల్లో జరిమానాలు విధించినా నిబంధనలు పాటించని వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతోపాటు దుకాణాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, ప్లాస్టిక్ పుల్లలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ట్రేలు, ఫోర్కులు, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, స్టిరర్లు, థర్మాకోల్ అలంకరణ వస్తువులు తదితరాలపై నిషేధం ఉందన్నారు. వార్డు స్థాయిలోని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు తయారీ యూనిట్లు, గోదాములు, హోల్‌సేల్ మార్కెట్లు, రిటైల్ దుకాణాలు, వీధి వ్యాపారుల వద్ద ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, 60 జీఎస్ఎం కంటే తక్కువ నాన్-ఓవెన్ బ్యాగులు, 100 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్/పీవీసీ బ్యానర్ల వినియోగం నిషేధమన్నారు. ప్రజలు గుడ్డ, జూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు.

# అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలి



**గుంటూరు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):** సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, డీపీఓ సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై అధికారులు పారదర్శకంగా విచారణ నిర్వహించి, వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ఉచిత భోజనం వంటి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విధులను అంకితభావంతో నిర్వహించాలి




**బాపట్ల, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):** ప్రభుత్వ అధికారులు విధులను అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని, కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సమస్యపై అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఈ రోజు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 127 అర్జీలు అందినట్లు కలెక్టర్ తెలిపారు. గత వారంలో అర్జీల పరిష్కారంలో అత్యుత్తమ సేవలు అందించిన చీరాల దేవాంగపురి-1, స్వర్ణ గ్రామంలోని సంక్షేమ, విద్యా సహాయకురాలు కులకల సౌందర్యను కలెక్టర్ సన్మానించారు. అనంతరం సంక్షిప్త ఓటరు సవరణ జాబితా, పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, పురపాలక ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఎస్ఐఆర్ నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియపై మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. రోజుకు 250 మంది చొప్పున హియరింగ్ నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యాలయాల్లో ఫైళ్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, అధికారులు తమ పరిధిలోని కార్యాలయాల పనితీరును కూడా పర్యవేక్షించాలని సూచించారు. సెప్టెంబర్ 3న మెప్మా, బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న లోన్ మేళాకు అర్హులైన వారందరికీ రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/25/2026 4:11 AM Page 5



# ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ.

## బాధిత కుటుంబాలకు పరామర్శ...

**బాపట్ల, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**

బాపట్ల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డు, గాయత్రి అపార్ట్‌మెంట్ సందులో నిర్వహించిన భగవాన్ శ్రీశ్రీశ్రీ గోలగమూడి వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా అన్నవితరణ చేశారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన పార్టీ అధ్యక్షుడు దామర్ల సూర్యనారాయణ అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి



వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఇదే గ్రామానికి చెందిన కేసాని శ్రీనివాసరావు ఇటీవల వ్యవసాయ పొలంలో పాముకాటుకు గురై మృతి చెందగా, ఆయన పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న దామర్ల సాంబయ్యను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అభివృద్ధి పనులతోపాటు విద్యకు ప్రాధాన్యం -

## ఎమ్మెల్యే రామాంజనేయులు

**ప్రత్తిపాడు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు తెలిపారు. పెదనందిపాడు మండలం పాలపర్రు, అన్నపర్రు గ్రామాల్లో సోమవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలపర్రు గ్రామంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమ విజయాలు, ప్రజా పాలన--ఇంటింటికీ అభివృద్ధి' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాల ద్వారా వివిధ వర్గాలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల



కల్పనకు నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామస్థులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం అన్నపర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ప్రహరీ తదితర వసతులను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులని, వారి విద్యాభివృద్ధికి వేసే ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అంకారావుకు బెయిల్..

## కూటమి ప్రభుత్వ కుట్రలకు న్యాయస్థానంలో చెక్!

**పల్నాడు:రక్షణ న్యూస్...**

వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి భీమిని అంకారావుకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది ఎంఎన్ ప్రసాద్ స్పందించారు. అంకారావును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపాలన్న కూటమి ప్రభుత్వం, పోలీసుల ప్రయత్నాలకు కోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. దొంగతనం, కత్తితో దాడికి వచ్చాడంటూ తీవ్రమైన ఆరోపణలతో కేసులు నమోదు చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుగుతున్న యువ నాయకులను



తప్పుడు కేసులతో భయపెట్టి వెనక్కి తగ్గించాలని చూస్తే ప్రజలు, న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టి వారి గొంతు నొక్కడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వైఎస్సార్‌సీపీని గొడ్డలి పార్టీ అని విమర్శిస్తే ఓకే.. టీడీపీని వెన్నుపోటు పార్టీ అంటే కేసులా?' అని ఎంఎన్ ప్రసాద్ ప్రశ్నించారు. అంకారావుకు బెయిల్ రావడం న్యాయం గెలిచినట్లేనని, అక్రమ కేసులు, రాజకీయ వేధింపులకు న్యాయస్థానాలే సరైన సమాధానం చెబుతున్నాయని అన్నారు.

# లేడీస్ హాస్టల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

**చిలకలూరిపేట, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ పరిధిలో ఓ ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో చిలకలూరిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని యామిని (24) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హాస్టల్ గదిలో ఆమె మృతిచెంది ఉండటాన్ని స్నేహితురాళ్లు గుర్తించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది .సమాచారం ప్రకారం.. యామిని హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమెతోపాటు ఉంటున్న స్నేహితురాళ్లు బయటకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు వచ్చారు. ఆ సమయంలో యామిని ఉంటున్న గది తలుపులు లోపలి నుంచి గడియ వేసి ఉండటంతో అనుమానం వచ్చింది. పలుమార్లు తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో గది తెరిచి చూడగా యామిని మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. యామిని మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.మృతురాలు గతంలో పండరీపురంలో నివాసం ఉన్నట్లు, ప్రస్తుతం ఆమె కుటుంబం కావూరు గ్రామంలో ఉంటున్నట్లు సమాచారం. తండ్రి సుబ్బారావు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు లక్ష్మి, సుబ్బారావు కుమార్తె మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి యామిని మృతికి దారితీసిన కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయ మార్పే లక్ష్యంగా రాష్ట్ర మహాసభ

**గుంటూరు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**



ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ మార్పు తథ్యమని, 2029 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులోని హోటల్ సింధూరలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జి పంగులూరి బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అధ్యక్షులు, కార్యదర్శులతోపాటు 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్ల నియామకాన్ని త్వరలో పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 12 జిల్లాల ప్రతినిధులను, 42 నియోజకవర్గాల కోఆర్డినేటర్లను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర సంపదను దోచుకుంటున్న పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యువత, భావితరాల భవిష్యత్తు కోసం నూతన రాజకీయ మార్పును సాధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆంధ్రుల మౌనం పిల్లల భవిష్యత్తుకు శాపంగా మారకూడదని పేర్కొన్నారు. రాజకీయ మార్పుతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సాధ్యమవుతుందని అన్నారు. 2029 ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో యువతకు పెద్దపీట వేస్తామని చెప్పారు.పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలాలు, గ్రామాల స్థాయిలో పూర్తిస్థాయిలో అభ్యర్థులను బరిలో నిలిపి కూటమి ప్రభుత్వానికి దీటుగా పోటీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నాయకులు నాగరాజు, శ్రీనివాసు, నాగేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ మాజీ నేత బాలకోటిరెడ్డి అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

**చుండూరు: రక్షణ న్యూస్**

చుండూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనకు సంబంధించి టీడీపీ మాజీ నాయకుడు కుదేటి బాలకోటిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దళిత సామాజిక వర్గానికి చెందిన చుండూరు సీఐ ఆనందరావును కులం పేరుతో దూషించారన్న ఆరోపణలపై బాలకోటిరెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. అప్పటి నుంచి పరారీలో ఉన్న బాలకోటిరెడ్డిని ప్రత్యేక పోలీసు బృందం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి బాలకోటిరెడ్డి, మరికొందరు చుండూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఆనందరావును కులం పేరుతో దూషించారని, విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటన అనంతరం బాలకోటిరెడ్డి అందుబాటులో లేకపోవడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు.

**రంగారెడ్డిలో పట్టుకున్న పోలీసులు...**బాలకోటిరెడ్డి కోసం ఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో అతడిని అదుపులోకి తీసుకుని చుండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసులో నిందితులుగా ఉన్న బాలకోటిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, గుణపవన్, ఎలిషాలను తెనాలి రెండో అదనపు న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

**జైలుకు తరలింపు...**కోర్టు ఆదేశాల మేరకు బాలకోటిరెడ్డిని నెల్లూరు సబ్‌జైలుకు తరలించగా, మిగిలిన ముగ్గురు నిందితులను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా, బాలకోటిరెడ్డిని ఇటీవల టీడీపీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు నేపథ్యంలో చుండూరు ప్రాంతంలో రాజకీయంగా కూడా చర్చ మొదలైంది. గతంలో బాలకోటిరెడ్డిపై పలు ఆరోపణలు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగినప్పటికీ, ప్రస్తుతం చుండూరు పోలీస్‌స్టేషన్ ఘటనకు సంబంధించి నమోదైన కేసులో పోలీసుల దర్యాప్తు, కోర్టు ప్రక్రియ కీలకంగా మారాయి. లిపోలీసుల ఆరోపణలు దర్యాప్తులో తేలాల్సి ఉండగా.. బాలకోటిరెడ్డి అరెస్టుతో చుండూరు పోలీస్‌స్టేషన్ ఘటన కేసు కీలక దశకు చేరింది.

## పోలీసు సేవలకు ఘన సత్కారం

**పిడుగురాళ్ల రక్షణ న్యూస్**



విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిడుగురాళ్ల పట్టణ ఎస్ఐ శివ నాగరాజుకు ప్రశంసాపత్రం లభించింది. జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూటమి నాయకులు ఎస్ఐ శివ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# రామానుజ కూటమి రద్దు ఆర్డర్‌పై పునఃపరిశీలన చేయాలి

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ బ్యూరో...**

మాకర్లవారి రామానుజ కూటమి అమాల్గమేషన్‌ను రద్దు చేస్తూ తీసుకున్న ఉత్తర్వులను పునఃపరిశీలించాలని మాజీ ఉపసభాపతి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. భక్తులు, బాపట్ల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణాలను పూర్తి చేయాలని, సూర్యలంకలో బాపట్ల ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు దశాబ్దాలుగా రామానుజ కూటమి క్షీణదశకు చేరుకుందని, మాకర్లవారు ఏర్పాటు చేసిన కూటమి ఆశయాలను కొనసాగించడంతోపాటు బాపట్ల క్షేత్రపాలకుడైన శ్రీ భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గతంలో అమాల్గమేషన్ ప్రక్రియను చేపట్టినట్లు కోన రఘుపతి తెలిపారు.తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఎండోమెంట్ శాఖ అధికారులతో సంప్రదించడంతోపాటు మాకర్లవారి కుటుంబాలు, కూటమితో అనుబంధం ఉన్నవారు, భక్తులతో చర్చించిన అనంతరం ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు.

**శాశ్వత ఆదాయ వనరుగా..**శిథిలావస్థకు చేరిన పాత రామానుజ కూటమి స్థానంలో టీటీడీ ఆలయ సత్రాలను తలపించేలా ఆధునిక సౌకర్యాలతో భవనాన్ని నిర్మించినట్లు రఘుపతి చెప్పారు. ఇందులో భావనారాయణస్వామి భక్తుల విరాళాలు కూడా ఉన్నాయని తెలిపారు. భవనాన్ని బ్యాంకుకు అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒకవైపు దేవస్థానం అభివృద్ధికి, మరోవైపు మాకర్లవారి ఆశయాల సాధనకు వినియోగించేలా శాశ్వత ఆదాయ వనరుగా రూపొందించినట్లు పేర్కొన్నారు.భక్తులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే వారికి వసతి, ఎండోమెంట్ శాఖ కార్యాలయ గది, చిన్న ఫంక్షన్ హాల్ వంటి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నిర్వహణలో లోటుపాట్లు ఉంటే ఎండోమెంట్ అధికారులు, భక్తులు, కమిటీలతో చర్చించి సరిదిద్దాలని సూచించారు.

**ఆలయాల నిర్మాణాలు పూర్తి చేయాలి...**బాపట్ల ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణాలను ప్రభుత్వం, అధికారులు త్వరగా పూర్తి చేయాలని రఘుపతి కోరారు. "అభివృద్ధి చేయాలనుకోవడమే కాదు.. అభివృద్ధి చేతల్లో కనిపించాలి" అని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినందున ఇకనైనా ఈ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**సూర్యలంకలోనే ఎయిర్‌పోర్టు...**బాపట్ల పర్యాటక, ఆర్థిక అభివృద్ధికి విమానాశ్రయం కీలకమని రఘుపతి అన్నారు. తమ హయాంలో ప్రతిపాదించిన విధంగా సూర్యలంకలోనే బాపట్ల ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిని రాజకీయ అంశంగా కాకుండా బాపట్ల భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్య అంశంగా చూడాలని సూచించారు.

**అందరితో చర్చించి నిర్ణయం...**అమాల్గమేషన్ రద్దు ద్వారా భావనారాయణస్వామి దేవస్థానం నిర్వహణ, మాకర్లవారి ఆశయాలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని రఘుపతి అన్నారు. ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో, బాపట్ల ఎమ్మెల్యేతో మాట్లాడినట్లు తెలిపారు. వ్యక్తిగత స్వార్థం లేదని, బాపట్ల అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.మాకర్లవారి కుటుంబ సభ్యులు, భక్తులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత వర్గాలతో సమగ్రంగా చర్చించి ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే జారీ చేసిన అమాల్గమేషన్ రద్దు ఉత్తర్వులను పునఃపరిశీలించి, బాపట్ల ప్రజల ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం ముందడుగు వేయాలని రఘుపతి విజ్ఞప్తి చేశారు.

# మురళీకృష్ణ బదిలీపై వెనక్కి తగ్గిన శాఖ

**గుంటూరు, రక్షణ న్యూస్...**

గురజాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జి.మురళీకృష్ణను గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఇతర విధులపై (ఓడీ) పంపుతూ ఈ నెల 20న జారీ చేసిన ఉత్తర్వులను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రద్దు చేసింది. పరిపాలనా కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.గురజాల ఏఎంసీలో విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణను గుంటూరు ఏఎంసీకి ఓడీపై పంపుతూ తొలుత ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే తాజాగా జారీ చేసిన రద్దు ఉత్తర్వులతో ఆ నిర్ణయానికి బ్రేక్ పడింది. పరిపాలనా కారణాల పేరుతో గత ఉత్తర్వులను ఉపసంహరించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.గురజాల, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు ఈ ఉత్తర్వుల మేరకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ ఆదేశించింది. ఈ మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ కె.నాగవేణి ఉత్తర్వులు జారీ చేశారు.మొత్తంగా నాలుగు రోజుల్లోనే ఓడీ ఉత్తర్వులు రద్దు కావడం శాఖలో తీసుకున్న నిర్ణయాలపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఉత్తర్వుల్లో రద్దుకు కారణంగా కేవలం 'పరిపాలనా కారణాలు' మాత్రమే పేర్కొనడం గమనార్హం.

# శాంతియుత ఎన్నికలకు పోలీసుల దిశానిర్దేశం

**కర్లపాలెం రక్షణ న్యూస్**

ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర సూచించారు. కర్లపాలెం మండలం లోని యెట్రావారిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో గ్రామ పెద్దలు, ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై పోలీసుల తరఫున దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత ఘర్షణలకు దారితీయకుండా సంయమనం పాటించాలని, గ్రామంలో ఐక మత్యం, సోదరభావంతో మెలగాలని ఎస్సై సూచించారు. చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా పరస్పరం సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయరాదని, వ్యక్తిగత, బ్యాంకు వివం ాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయవద్దని అవగాహన కల్పిం చారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారుఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.